మున్నూరుకాపు మహాసభ మహిళా కమిటీ కన్వీనర్‌గా సుజాత



సుజాతను అభినందిస్తున్న పిల్లి శ్రీనివాస్ రావు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ మహిళా కమిటీ కన్వీనర్‌గా చామకూర సుజాత, ఇన్‌చార్జిగా అడ్వొకేట్ అన్నపూర్ణను నియమిస్తూ మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు ప్రకటించారు. ఈ సందర్భంగా కాచిగూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సుజాత, అన్నపూర్ణతో పాటు సభ్యులుగా నియామకమైన భాగవతి, జ్యతి, లక్ష్మీ, దుర్గా, సరిత, శైలజ, అరవింద, అనుషా, మంజుల, జ్యోతిలక్ష్మీలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. త్వరలోనే కాచిగూడలోని మున్నూరు కాపు భవన్ ప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల నగేష్, దండు నరేందర్, బాధే పద్మరావు, చెల్మేల మహేష్ బాబు, దయానంద్, పద్మనాభం, చేపూరి వెంకటేశ్వర్లు, నర్సింగ్‌రావు, దండు ఆనంద్, గంధం విశాల్, రాకేష్ పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం



ముషీరాబాద్: తెలంగాణ రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి, గ్రేటర్ హైదరాబాద్ ఇన్‌చార్జిగా నియమించబడ్డ పొన్నం ప్రభాకర్‌కు ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందని సీనియర్ కాంగ్రెస్ నేతలు యాదగిరి, జి.ఎస్.కేశవ్, పి.బల్వంతరావు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రి సూచించినట్లు నాయకులు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సంఘం సభ్యులు

ముషీరాబాద్: జంట నగరాల మహేంద్ర మేదరి సంఘం నూతన అధ్యక్షుడిగా రేశం మల్లేష్ ఎన్నికయ్యారు. చిక్కడపల్లికి చెందిన సంఘం అధ్యక్షులు పిల్లి నరహరి ఇటీవల మరణించినందున ఆయన స్థానంలో మంగళవారం జంట నగరాల మహేంద్ర మేదరి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాత కోటి సూర్యప్రకాష్(అడ్వకేట్), ప్రధాన కార్యదర్శిగా పిల్లి గురుమూర్తి, కోశాధికారిగా కైలాష్‌కుమార్ ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్య నిర్వహక, కార్యవర్గ సభ్యులు వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



పనులను పర్యవేక్షిస్తున్న ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: బర్కత్‌పుర చమన్ వద్ద మ్యాన్‌హోల్ కుంగి వాహనదారులు, పాదచారులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించి కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ జలమండలి అధికారులు, సిబ్బందికి సమస్యను వివరించగా మంగళవారం మ్యాన్‌హోల్ మరమ్మతులు చేపట్టారు.

విద్యతోనే సమాజంలో మార్పు



జయంతి వేడుకల్లో పాల్గొన్న మంజుశ్రీ, విజయ వీర్ విద్యాలంకర్

కాచిగూడ: విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని స్వామి శ్రద్ధానంద్ మనుమరాలు మంజుశ్రీ, డాక్టర్ విజయవీర్ విద్యాలంకర్ అన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు పండిట్ గంగారామ్ మెమోరియల్ ఫోరం ఆధ్వర్యంలో స్వామి శ్రద్ధానంద్ 200వ జయంతి వేడుకను ఆర్య కన్యా విద్యాలయ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వామి శ్రద్ధానంద్ తన సంకల్పంలో దృఢంగా ఉండి మహర్షి దయానంద్‌ని కలుసుకోవడం ద్వారా సత్యం పట్ల ఆయనకున్న భక్తితో పాటు అతని జీవితం మారిపోయిందని చెప్పారు. తండ్రి ఆదేశానుసారం మహర్షి దయానంద్ ఉపన్యాసాలు వినడానికి స్వామి శ్రద్ధానంద్ వెళ్లేవాడని, దీంతో అతను మున్షీరామ్ నుంచి స్వామి శ్రద్ధానంద్‌గా మారాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తరామ్, మహేష్ అగర్వాల్, ప్రేమ్ చంద్ మునోత్, సోమనాథ్, దినేష్ సింగ్, రోజా, మనోహర్ సింగ్, రామలత, సవిత, పూజ, భగత్ సింగ్, భగీరథ్ శారద పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా దత్తాత్రేయ జయంతి



బాబా ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం



నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా మందిరంలో మంగళవారం దత్తాత్రేయ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన, కాకడహారతి, సాయిబాబా మూల విరాట్‌కు దివ్య మంగళ స్నానం చేశారు. దత్తాత్రేయ స్వామిని వివిధ రకాల పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గుర్తుతెలియని మహిళ మృతి

కాచిగూడ: గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ రైల్వే స్టేషన్ ఎదురుగా జెండా వద్ద గుర్తుతెలియని మహిళ (50) మృతి చెంది ఉంది. మృతురాలి ఒంటిపై ఎరుపు రంగు నైటీ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

1444 డ్రంకెన్ డ్రైవ్ కేసులు..
రూ. 28 లక్షల జరిమానా!

- ఈ ఏడాదిలో చిక్కడపల్లి పరిధిలో నమోదైన కేసులు
- నేటి నుంచి ఆన్‌లైన్ ద్వారా పెండింగ్ చలాన్‌ల చెల్లింపు
- సద్వినియోగం చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసుల విజ్ఞప్తి





డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ వీరేశం(ఫైల్)

చిక్కడపల్లి: చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో గతేడాది లో 1547 డ్రంకెన్ డ్రైవ్ కేసులు కాగా 1462 డిస్పోజబుల్ కేసులు అయ్యాయి. ఈ ఏడాది 1444 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు కాగా వీటిలో 1321 కేసులు డిస్పోజ్ చేశారు. నగరం నడిబొడ్డున ఉన్న చిక్కడపల్లి, ముషీరాబాద్, దోమలగూడ, గాంధీనగర్ లా అండ్ ఆర్డర్ పీఎస్‌ల పరిధిలోకి వచ్చే దాదాపు అనేక ప్రాంతాలు చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలోకి వస్తాయి. ఈ ప్రాంతంలో అనేక బార్లు, వైన్‌షాప్‌లు ఉండడంతో పాటు ఎప్పుడు రద్దీగా ఉండే ప్రాంతాలు కావడంతో కేసుల సంఖ్య పెరుగుతోంది. 2022లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.31,92,500 2023లో రూ.28,43,600 జరిమానా విధించారు. పెండింగ్‌లో ఉన్న ఈ చలాన్‌లు చెల్లించేందుకు మంగళవారం రోజు నుంచే ప్రారంభం అయ్యాయి. దీనిని వాహనాదారులు ఉపయోగించి పెండింగ్‌లో ఉన్న ఈ-చలాన్‌లు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ సెంట్రల్ జోన్ ఏసీపీ ఎన్‌టీ రత్నం, చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ ఎస్.వీరేశలు విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు..

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని నో పార్కింగ్, వాహనాలను రాష్‌గా నడిపిన వారిపై కఠిన చర్యలు, జరిమానాలు విధిస్తామని చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం హెచ్చరించారు. ఈ-చలాన్లు ట్రాఫిక్ నింబంధనలను పాటించని ద్విచక్రవాహనాలు, ఆటోలపై 80 శాతం, 90 శాతం ఆర్టీసీ బస్సులు, లైట్ మెటార్, హేవీ మోటార్ 80 శాతం ఫైన్ చెల్లించాలి. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న 20 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేశామని 120 మందికి జైలు శిక్ష విధించామన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలి



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలు పేద ప్రజలందరికి అందించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలకు రేషన్ కార్డును ప్రాతిపదికన తీసుకోవడంతో రేషన్ కార్డు లేని అనేక వేల పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. దాదాపు రాష్ట్రంలో పది లక్షల రేషన్ కార్డు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని మరో రెండు లక్షల మంది దరఖాస్తు చేయని వారు ఉన్నారని వీరందరికి సంక్షేమ పథకాలు దూరమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. గతంలో ఉమ్మడి కుటుంబాల్లో ఉన్నటువంటి అన్నదమ్ములు, వివాహాలు జరిగి విడిపోయి అద్దె ఇళ్లల్లో ఉంటున్నారని వారందరికి తెల్లరేషన్ కార్డులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రజాపాలనకు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారని కేవలం వారం రోజుల సమయం వల్ల అందరు దరఖాస్తు చేసుకోలేరని దరఖాస్తు గడువును పెంచాలని కోరారు. ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరి వెంకట్, రాజేష్, శాంతికిరణ్, వెంకట్, నక్క రమేష్, బోయ ప్రవీణ్, నాగరాజు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆశలు నెరవేర్చేందుకు కృషి

చిక్కడపల్లి: నిరుద్యోగుల ఆశలు నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. మంగళవారం నిరుద్యోగులు సమస్యలపై తన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగులు ఉద్యమ నాయకురాలు సలీమ్‌తో వెంకట్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల సమస్యలపై దాదాపు రెండు గంటల పాటు వెంకట్ ఈ సందర్భంగా తనతో చర్చించినట్లు సలీమ్ వివరించారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

లిబర్టీ: నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని బీసీదళ్ జాతీయ అధ్యక్షుడు కుమరస్వామి విజ్ఞప్తి చేశారు. ఆర్థిక, రాజకీయ, సామాజికంగా వెనుకబడిన బీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి సముచిత స్థానం కల్పించి బీసీల ఆదరణ పొందాలని సూచించారు. మంగళవారం దళ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్లు మార్కెట్ కమిటీలు ఇతర నామినేటెడ్ పదవుల పంపకాల్లో 50 శాతం పదువులు బీసీలకు కేటాయించాలన్నారు. గత ఎన్నికల్లో బీసీలంతా కాంగ్రెస్‌కు అండగా నిలిచారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. 54 కార్పొరేషన్లు మార్కెట్ కమిటీలు ఇతర నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. మంత్రివర్గంలో ఇప్పటికే ఇద్దరికి మాత్రమే స్థానం కల్పించారని, బీసీని ఉపముఖ్యమంత్రి చేస్తే మరింత బాగుండేదని అభిప్రాయపడ్డారు.

సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న మణిమంజరి

కవాడిగూడ: జనవరి 3న భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహిస్తామని పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు మణిమంజరి వెల్లడించారు. మంగళవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న మహిళలను సన్మానిస్తామన్నారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేను ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే 600కు పైగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా అప్లికేషన్స్ వచ్చాయని వాటన్నింటిని పరిశీలించి, 300 మంది మహిళలను ఎంపిక చేసి వారిని సత్కరించి, సావిత్రి బాయి పూలే అవార్డు, మెమోంటోను అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు తారకేశ్వరి, సమతాయాదవ్, సంధ్యారాణి, సుజాత, పద్మజ, దేవిక, రేణుక, లావణ్య, పద్మశ్రీ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఖైరతాబాద్ : పేదవారికి సాయం చేయాలనే ఆలోచనతో పుట్టినరోజు వేడుకలకు ఖర్చుచేసే డబ్బుతో సేవా కార్యక్రమానికి దారితీసింది. అగ్రికల్చర్ మొదటి సంవత్సరం చదువుతున్న అఖిల నూనె మంగళవారం ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో ఉచిత వైద్య శిబిరంతో పాటు పేదలకు ఉచితంగా దుప్పట్లు, మహిళలకు ప్యాడ్స్‌ను అందజేశారు. గత నాలుగేళ్లుగా తన పుట్టినరోజున అనవసర ఖర్చులు చేయకుండా ఆ మొత్తంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని, ఈసారి కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నానన్నారు. వైద్యశిబిరంలో కంటి, డెంటల్, షుగర్, ఈఎన్‌టీ పరీక్షలు నిర్వహించారు. సైఫాబాద్ ట్రాఫిక్ ఏసీపీ రత్నం, నాంపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ వీరేశం, అబిడ్స్ ఎస్సై పాండురాజ్‌లతో పాటు మహేందర్‌బాబు, మహేష్‌యాదవ్, గజ్జల ఆనంద్, అజయ్, పూస అనిల్, రమాదేవి తదితరులున్నారు.

కార్పొరేట్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి



జెండాను ఎగరవేస్తున్న బి.వెంకటేశం

కాచిగూడ: కేంద్రంలోని ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తరిమికొట్టేందుకు సిద్ధమవ్వాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేశం పిలుపునిచ్చారు. సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం అంబర్‌పేట నియోజకవర్గం సమితి ఆధ్వర్యంలో పార్టీ పతాకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ బడుగు బలహీన వర్గాల తాడిత, పీడిత ప్రజల కోసం పుట్టిన పార్టీగా భారత దేశంలో గుర్తింపు తెచ్చుకుందన్నారు. రైతులు, కార్మికులు, విద్యార్థి యువత, మహిళల హక్కుల సాధనకై అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధితో పోరాడే పార్టీ సీపీఐ పార్టీ మాత్రమే అని పార్టీ నిర్మాణం కోసం ఎంతోమంది ప్రాణాలు త్యాగం చేశారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో దగా పడ్డ ప్రజల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, ఓమర్‌ఖాన్, ఎం.శ్రీను, కృష్ణ, లతీఫ్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి



పార్టీ జెండాను ఎగురవేస్తున్న చాడ, నారాయణ, కూనంనేని

హిమాయత్‌నగర్: స్వాతంత్య్ర పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకంగా ఉందని, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. దేశంలోని ప్రతి పౌరుడికి అధికారం కలిగించే భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి రాజ్యాంగ పరిషత్ డిమాండ్‌ను లేవనెత్తింది సీపీఐ పార్టీయేనని తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్, సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. చాడ వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభజన రాజకీయాలు, మతం పేరుతో దేశంలో విధ్వంసం సష్టిస్తున్నారని ఆరోపించారు. కేంద్రపాలనలో రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు, దళితులు, అణగారిన వర్గాల వారు దాడులకు గురవుతున్నారని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని రక్షించుకునే బాధ్యత కమ్యూనిస్టులపైనే ఉందని, వాటిని రక్షించుకునేందుకు దేశవ్యాప్తంగా బలమైన పోరాటాలు నిర్వహించాలని చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ కార్యదర్శి కె.నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఈ.టి.నరసింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సీపీఐ సీనియర్ నాయకులు ప్రేమ్‌పావని, వెంకటేశం, కమతం యాదగిరి, స్టాలిన్, ఎండీ. సలీమ్, పడాల నళిని, సలీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య అల్పాహారం వితరణ ప్రారంభం



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌లోని నల్లపోచమ్మ, ఉప్పలమ్మ దేవాలయంలో బండారి భారత్‌గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములకు నిత్య అల్పాహారం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంగళవారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. స్వాములు అల్పాహారం స్వీకరించి అయ్యప్ప స్వామి దీవెనలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, బాలమురళి, వై.యాదగిరి, సిద్ధార్థ్, సాయికృష్ణ, సాయిరామ్(స్వాములు) తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక గ్యార్వీ



గ్యార్వీ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: గ్యార్వీ ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, మతసామరస్యాన్ని పెంపొందిస్తున్నాయని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లో నూర్, మహ్మద్ జాబేద్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్వీ ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇరు వర్గాల ప్రజలు గ్యార్వీ ఉత్సవాలను ఐక్యంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. ప్రతీ సంవత్సరం ముషీరాబాద్‌లో గ్యార్వీ ఉత్సవాలను నిర్వహిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు సేవాభావాన్ని పెంపొందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పర్వేజ్, అరవింద్‌కుమార్‌యాదవ్, నవీన్‌గౌడ్, మలాన్‌ఖాన్, ముజాఫర్‌ఉల్లా, షాహెద్ జాఫర్ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

కాచిగూడ: శ్రీ సాయి శాంతి సహాయ సేవా సమితి నూతన సంవత్సర కేలండర్‌ను మంగళవారం తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆవిష్కరించారు. శ్రీ సాయి శాంతి సహాయ సేవా సమితి అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎర్రం పూర్ణ శాంతి గుప్తా, నవీన్ గోరంట్ల, సీతారామయ్య పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భాస్కర్‌రావు

కవాడిగూడ: ఆధ్యాత్మిక భావనతోనే ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతత పొందుతారని దోమలగూడ విజయగణపతి దేవాలయ చైర్మన్ భాస్కర్‌రావు, అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో దత్తాత్రేయ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిసర ప్రాంతాలలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రావు, నాయకులు రమేష్, సూర్యనారాయణ పాల్గొన్నారరు.

మంత్రి పొన్నంకు వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం ఇస్తున్న మురళీ కృష్ణ

నల్లకుంట: తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు మురళీ కృష్ణ, జాగృతి ప్రధాన కార్యదర్శి సుదర్శన్ మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వంగా కలిశారు. బీసీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వగా అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో రామ్ మోహన్ రావు, రఘురామ్, తుమ్మల శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ ఉన్నారు.

మాస్క్ పెట్టుకుందాం.. మళ్లీ రాకుండా చేద్దాం!

కొన్నాళ్ల కిందట కనుమరుగైన కరోనా భయం.. మళ్లీ పట్టుకుంది. కరోనా (జేఎన్-1 వేరియెంట్) కేసులు పెరుగుతున్న రాష్ట్రాలలో జాగ్రత్తలు పాటించాలని కేంద్రం హెచ్చరించింది. అయితే నగరంలో జనం ముందస్తుగానే అప్రమత్తమయ్యారు. కార్యాలయాలు, వ్యాపారాలు, కిరాణ దుకాణాల నిర్వహించే వారు, విద్యార్థులు నిత్యం మాస్క్‌లు పెట్టుకుని వెళ్తున్నారు. ప్రధానంగా జనం రద్దీగా ఉండే ప్రాంతాలలో తిరిగేవారు మాస్క్‌లు పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. పక్క రాష్ట్రమైన కర్ణాటకలో 50 ఏళ్ల పైబడిన వారికి మాస్క్ మస్ట్ అనడంతో మళ్లీ కరోనా పెరిగే ప్రమాదం ఉందని ఇక్కడ సైతం మాస్క్‌లు ధరించి జాగ్రత్తలు పాటిస్తున్నారు. మంగళవారం కవాడిగూడ, ముషీరాబాద్, రామ్‌నగర్ ప్రాంతాల్లో ఇలా మాస్క్‌లు ధరించి వెళ్తున్న దృశ్యాలు 'సాక్షి' కంటపడ్డాయి. –కవాడిగూడ



మాస్క్‌లతో బైక్ రైడర్ ఓ దుకాణం యజమాని